మన రాజధాని
APTEL/25/A5250

రక్షణ

నిజం మా బలం
ఎడిటర్ నరేంద్ర

28.10.2026
బుధవారం
సంపుటి (Volume): 1
సంచిక (Issue) : 97
పేజీలు : 8
Pages : 4
వెల : 4
Published from : గుంటూరు

వెల్లింగ్టన్‌లో అభిషేక్ సునామీ

రికార్డుల మోతతో సిరీస్ భారత్ కైవసం

వివరాలు 3లో



లిటిగేషన్లే ఆ పార్టీ రాజకీయం.

మా రెండున్నరేళ్ల కష్టాన్ని గుర్తించండి: సీఎం చంద్రబాబు

- లిటిగేషన్లతో స్థానిక ఎన్నికలు ఆపాలని గొడ్డలి పార్టీ చూస్తోందన్న చంద్రబాబు
- ఎన్నికలు ఆపేందుకు ఏకంగా 62 పిటిషన్లు దాఖలు చేశారని ఆరోపణ
- హింసను వీడి వైసీపీ నేతలు జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపు
- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ధీమా
- రెండున్నరేళ్ల పాలనను చూసి స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి

“ మన రాజధాని రక్షణ ప్రతినిధి :న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసి ప్రభుత్వ కార్యకలాపాలను అడ్డుకో వడమే ప్రధాన రాజకీయంగా పెట్టుకుని, లిటిగేషన్లతో రాష్ట్రాభివృద్ధిని నిరోధించడమే లక్ష్యంగా ‘గొడ్డలి పార్టీ’ పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడానికి ఆ పార్టీ చేయని ప్రయత్నం లేదని, అభివృద్ధిని సహించలేని తత్వంతో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. వారి సిద్ధాంతం క్రిమినలైజేషన్, లిటిగేషన్, ఫేక్ ప్రాపగాండా అయితే.. తమ కూటమి సిద్ధాంతం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అని ఆయన స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల తమ కష్టాన్ని గుర్తించి, 2024 ఎన్నికల్లో ఇచ్చినట్లే, ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కూడా చారిత్రాత్మక మద్దతుతో కూటమిని ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ లతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ”

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు గుప్పించారు. “రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు ఆ పార్టీకి లేవు. రాష్ట్రానికి మంచి జరగడం, అభివృద్ధి జరగడం వారికి ఇష్టం లేదు. అందుకే, ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనీయకుండా చూడాలన్నదే వారి ఆలోచన. ఈ ఎన్నికలను ఆపడానికి

2 పేజీలో

రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ సభకు అనుమతి.

షరతులు విధించిన ఢిల్లీ పోలీసులు..

మన రాజధాని రక్షణ ప్రతినిధి

దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అయితే ఈ సభకు సంబంధించి పలు నిబంధనలు విధించారు.

వివరాలు 2లో



ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట..

‘లీవ్ ఇండియా’ నోటీసుపై బాంబే హైకోర్టు స్టే

బాలివుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు బాంబే హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఆయనకు జారీ చేసిన ‘లీవ్ ఇండియా’ నోటీసుపై కోర్టు స్టే విధించింది.

మీరు 2.0 అంటే... మేం 10X చూపిస్తాం

జగన్‌కు పవన్ కల్యాణ్ వార్నింగ్

- జగన్ బెదిరింపులకు ఎవరూ భయపడరన్న పవన్ కల్యాణ్
- రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ఐక్యంగా ఉంటుందని వెల్లడి
- ప్రజల మధ్యకు వస్తే వారి మనోభావాలు అర్థమవుతాయని జగన్‌కు సూచన

మన రాజధాని రక్షణ ప్రతినిధి : వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో బదులిచ్చారు. వైసీపీ ‘2.0’ అంటూ బెదిరింపులకు దిగితే, ఎన్డీఏ కూటమి ‘10X’ అంటే ఏంటో చూపిస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఎన్డీఏ మీడియా సమావేశంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

2 పేజీలో

పులివెందులలో టీడీపీ కూటమి ప్రభంజనం..

వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ

20 వార్డుల్లో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవం!

పులివెందుల మున్సిపాలిటీలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ

మొత్తం 40 వార్డులకు గాను 20 ఏకగ్రీవంగా గెలుచుకున్న టీడీపీ కూటమి!

నియోజకవర్గంలోని 65 ఎంపీటీసీ స్థానాలకు గాను 64 స్థానాల్లో కూటమి ఏకగ్రీవం!

.. వివరాలు 2లో

‘ఎస్ఐఆర్’పై కాంగ్రెస్ వైఖరిని నిలదీసిన సీఎం చంద్రబాబు

- ఈవీఎంలపై కాంగ్రెస్ ది ద్వంద్వ వైఖరి అంటూ చంద్రబాబు వ్యాఖ్యలు
- గెలిచినప్పుడు ఒకలా, ఓడినప్పుడు మరోలా మాట్లాడటం సరికాదని విమర్శ
- కొన్ని జాతీయ పార్టీల తీరు గొడ్డలి పార్టీ నేత తీరు ఒకలాగే ఉందని పరోక్ష వ్యాఖ్య
- గత పాలకుల తప్పులు సరిదిద్దడానికే మూడేళ్లు పట్టిందని వెల్లడి
- ప్రజల పట్ల, అభివృద్ధి పట్ల తమది భయం కాదు బాధ్యత అని స్పష్టీకరణ

2 లో

జగన్ ఉడత బెదిరింపులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరు

- జగన్ వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్
- ‘మా టైం వస్తుంది’ అనడానికి ఇది జమీందారీ రాజ్యం కాదని చురక
- గత ఐదేళ్ల పాలనలోని హింసాత్మక ఘటనలను గుర్తు చేసిన అచ్చెన్నాయుడు
- సొంత కుటుంబ సభ్యులపైనే జగన్ కక్ష సాధిస్తున్నారని తీవ్ర ఆరోపణ
- సోషల్ మీడియా వేదికగా జగన్‌పై విమర్శలు గుప్పించిన వ్యవసాయ మంత్రి

2 పేజీలో

ఈ రెండేళ్లు ఓపిక పడితే వచ్చేది జగన్ 2.0 అన్న జగన్

- అన్యాయం చేసిన అధికారులను వడ్డీతో సహా చెల్లించేలా చేస్తామని హెచ్చరిక
- పులివెందులలో కార్యకర్తలపై చేయి వేస్తే తనపై వేసినట్లేనని స్పష్టీకరణ

పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా..

భయపడొద్దు..తిరగబడండి

మన రాజధాని రక్షణ ప్రతినిధి

“ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0” అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

2 పేజీలో

రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట..

ఏపీ ప్రభుత్వానికి చుక్కెదురు

కసిరెడ్డి బెయిల్ రద్దు చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయస్థానం

విచారణకు సహకరించాలని, దేశం విడిచి వెళ్లరాదని షరతులు విధింపు

సహకరించకుంటే బెయిల్ రద్దుకు కోర్టును ఆశ్రయించవచ్చని ప్రభుత్వానికి సూచన

2 లో

నామినేషన్లు వేయడానికి యుద్ధం చేయాల్సి వస్తోంది

- స్థానిక ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందన్న అవినాశ్ రెడ్డి
- వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకుంటున్నారని ఆరోపణ
- కార్యకర్తలపై దాడులు చేసి, తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శ

మన రాజధాని రక్షణ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన పులివెందులలో జరిగిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అధికార దుర్వినియోగంతో ఎన్నికలు నిర్వహిస్తున్నారని,

2 లో

మీరు 2.0 అంటే... మేం 10x చూపిస్తాం:

మొదటి పేజీ తరువాయి

జగన్ బెదిరింపులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరని పవన్ స్పష్టం చేశారు. బలహీనులు మాత్రమే బెదిరింపుల భాష మాట్లాడతారని, బలవంతులు ఎప్పుడూ అలా చేయరని అన్నారు. ఇలాంటి మాటల వల్లే గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన విషయాన్ని మరువరాదని అన్నారు. వైసీపీ 1.0 పాలనలో జరిగిన హింసను తాము ధైర్యంగా ఎదుర్కొన్నామని, ప్రజలకు అండగా ఎలా నిలవాలో తమకు బాగా తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లుగా, జగన్ ప్రజల్లోకి వస్తే వారి కష్టాలు, మనోభావాలు అర్థమవుతాయని పవన్ హితవు పలికారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ఐక్యంగానే ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు వంటి సంక్లిష్టతలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రగతి కోసం కలిసికట్టుగా ముందుకు సాగుతామని తెలిపారు. రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలి తప్ప హెచ్చరికలు జారీ చేయకూడదని సూచించారు. ఇదే సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, వైసీపీ నేతల ప్రవర్తన వల్ల సమాజం నష్టపోతోందని విమర్శించారు.

'ఎస్ఐఆర్'పై కాంగ్రెస్ వైఖరిని నిలదీసిన సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల యంత్రాంగం, ఎస్ఐఆర్, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అనుసరిస్తోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. గెలిచినప్పుడు ఈవీఎంలు కరెక్ట్ అని, ఓడిపోయినప్పుడు మాత్రం వాటిపై నిందలు వేయడం ఆ పార్టీకి పరిపాటిగా మారిందని విమర్శించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి చంద్రబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "రాజ్యాంగబద్ధమైన వ్యవస్థగా ఎన్నికల కమిషన్ ది ఎప్పుడూ ఒకే విధానం. సీఈసీ విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరులు అనుసరిస్తున్నాయి. 'సర్'పై ఒకచోట ఒక వైఖరి, మరో చోట మరోవైఖరి అవలంభిస్తారా..? ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ.. గెలిస్తే ఈవీఎంలు సక్రమంగా ఉన్నట్టు, అదే ఓటమి పాలైతే ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపించడం సరైనదేనా? ఇది ఎక్కడి వైఖరి?" అని తీవ్రంగా ప్రశ్నించారు. ఇదే ఈవీఎంలతో గెలిచిన విషయాన్ని ఆ పార్టీలు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కేవలం కేంద్రంపై, రాష్ట్రాలపై బురద చల్లేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. జాతీయ స్థాయిలో కొన్ని పార్టీలు వ్యవహరిస్తున్న తీరు, రాష్ట్రంలోని 'గొడ్డలి పార్టీ' నేత తీరు ఒకేలా ఉందని చంద్రబాబు పరోక్షంగా వ్యాఖ్యానించారు. తనకు అనుకూలంగా ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా వ్యవహరించడం కొందరికి అలవాటైందని ఆయన దుయ్యబట్టారు. "ఒక వ్యక్తి వైఖరి వల్ల రాష్ట్రం ఎందుకు నష్టపోవాలి? రప్పరప్పా రాజకీయాలు చేసి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తారా? గతంలో రాజకీయాల్లోకి రౌడీలు వస్తే ప్రజలు గమనించేవారు, కానీ ఇప్పుడు రౌడీలే రాజకీయం చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు చేసిన అవకతవకలను సరిదిద్దడానికే తమకు మూడేళ్ల సమయం పట్టిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని, దేశాన్ని నిర్మించాలంటే సమర్థవంతమైన నాయకత్వం అవసరమని, ఎన్డీఏ ప్రభుత్వం ఆ దిశగానే నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ప్రజల పట్ల, రాష్ట్రాభివృద్ధి పట్ల తమకు ఉన్నది భయం కాదని, బాధ్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

పులివెందులలో టీడీపీ కూటమి ప్రభంజనం..

వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పురపాలక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభంజనం సృష్టించింది. మొత్తం 40 వార్డులకు గాను ఏకంగా 20 వార్డులను ఏకగ్రీవంగా గెలుచుకుని వైసీపీకి షాక్ ఇచ్చింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో, బరిలో ప్రత్యర్థులు ఎవరూ లేకపోవడంతో 20 వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ పరిణామంతో పులివెందుల మున్సిపల్ కౌన్సిల్‌లో పోలింగ్‌కు ముందే కూటమి సగం స్థానాలను ఖాయం చేసుకుంది. మిగిలిన 20 వార్డులతో పాటు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవికి ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు, పులివెందుల నియోజకవర్గ పరిధిలోని మొత్తం 65 ఎంపీటీసీ స్థానాలకు గాను 64 చోట్ల, అలాగే 7 జెడ్పీటీసీ స్థానాల్లో 3 స్థానాలు ఏకగ్రీవమైనట్లు (కూటమి అభ్యర్థులు) తెలుస్తోంది. అయితే, ఆయా ఫలితాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ ఫలితాలతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట.. ఏపీ ప్రభుత్వానికి చుక్కెదురు

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు కెసిరెడ్డి దేశం విడిచి వెళ్లరాదని, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని స్పష్టమైన షరతులు విధించింది. ప్రొడక్షన్ వారెంట్ జారీని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అరెస్ట్ చేయబోమని కోర్టులో హామీ ఇచ్చాక కూడా ప్రొడక్షన్ వారెంట్ జారీ చేయడంపై వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పులోని కొన్ని వ్యాఖ్యలతో తాము ఏకీభవించడం లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. అయితే, కేవలం ఆ కారణంతో నిందితుడికి మంజూరు చేసిన బెయిల్‌ను, స్వేచ్ఛను రద్దు చేయలేమని స్పష్టం చేసింది. పోలీసులు నేరుగా చేసే అరెస్ట్‌కు, కోర్టు జారీ చేసే ప్రొడక్షన్ వారెంట్‌కు మధ్య వ్యత్యాసం ఉందని వ్యాఖ్యానించింది. ముందస్తు అనుమతి లేకుండా నిందితుడిని మళ్లీ అరెస్ట్ చేయరాదని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లోని 23వ పేరాను సుప్రీంకోర్టు సమర్థించింది. ఒకవేళ నిందితుడు దర్యాప్తునకు సహకరించని పక్షంలో, బెయిల్ రద్దు కోసం మళ్లీ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో కెసిరెడ్డికి హైకోర్టు ఇచ్చిన బెయిల్ కొనసాగనుంది.

నామినేషన్లు వేయడానికి యుద్ధం చేయాల్సి వస్తోంది

నామినేషన్ వేయాలంటేనే యుద్ధం చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది. వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్నారు. కార్యకర్తలపై దాడి చేసి, బాధితులపైనే తిరిగి తప్పుడు కేసులు బనాయిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా తాము భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

లిటిగేషన్లే ఆ పార్టీ రాజకీయం..

మొదటి పేజీ తరువాయి

ఏకంగా 62 పిటిషన్లు వేశారు. సర్వేపైనా, డీలిమిటేషన్ పైనా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకెక్కారు. ఇప్పుడు ఎన్నికలు జరగకపోతే కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు ఆగిపోతాయి. స్థానిక సంస్థలు అభివృద్ధి చెందడం ఆ పార్టీకి ఇష్టం లేదు. బెంగళూరు నుంచి వచ్చి హిట్ అండ్ రన్ తరహాలో దాడులు చేస్తున్నారు. తీవ్రవాదుల్లా వ్యవహరిస్తున్నారు. గొడ్డలి పార్టీ నేతలు ఈ హింసా విధానాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలి" అని చంద్రబాబు హితవు పలికారు. తమ ప్రభుత్వ సహనాన్ని, సంయమనాన్ని కూడా ఆ పార్టీ దుర్వినియోగం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఆస్తుల కోసం సొంత చెల్లెల్ని, తల్లిని మోసం చేస్తున్నారు. అతని ఆలోచన ప్యాలెస్ కోసం, మా తపన పేద ప్రజల కోసం. గొడ్డలి పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని సమర్థంగా దాటుకుని ముందుకెళతాం" అని వివరించారు.

ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి వేగం

గత ప్రభుత్వ పాలన విధ్వంసంతోనే సాగిందని, ప్రజాకంటక పాలనను అంతమొందించడానికే ప్రజలు కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు. "విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు మాకు అప్పగించారు. ఎల్ నినో కరవు పరిస్థితులు, అర్ణబ్ తుపాను వంటి ప్రకృతి విపత్తులు ఎదురైనా ఎక్కడా అభివృద్ధి ఆగకుండా చర్యలు తీసుకున్నాం. బటన్ నొక్కుతున్నాం కానీ గుంతలు పూడ్చలేమని గత పాలకులు చేతులెత్తేస్తే, మేం సంక్షేమం అందిస్తూనే అభివృద్ధి చేసి చూపిస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టుల నుంచి డేటా సెంటర్ల వరకు ప్రతిచోటా అభివృద్ధి కనిపిస్తోంది" అని అన్నారు.

విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మూడు ఎకనామిక్ రీజియన్లను అభివృద్ధి చేస్తున్నామని, గ్రీన్ ఎనర్జీ కారిడార్ కింద రూ.27 వేల కోట్ల ప్రాజెక్టు రాష్ట్రానికి వచ్చిందని తెలిపారు. గత పాలకులు గోదావరిలో ముంచేసిన పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చారు. రెండున్నరేళ్లలో ప్రతి రంగంలో మార్పు తీసుకొచ్చి, ప్రతి కుటుంబానికీ న్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని కొనసాగించడానికి స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి 'ట్రిపుల్ ఇంజన్' ప్రభుత్వానికి శక్తినివ్వాలని ప్రజలను కోరారు.

సీట్ల సర్దుబాటుపై అపూర్వ కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కోసం తాను, పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ చేయనంత కసరత్తు చేశామని చంద్రబాబు తెలిపారు. "ఎంపీటీసీ స్థాయి వరకు సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాం. జనాభా దామాషా ప్రకారం సోషల్ ఇంజనీరింగ్ ఆధారంగానే సీట్లు కేటాయించాం. కూటమి ధర్మాన్ని పాటిస్తూ బీ-ఫాం ఇచ్చిన అభ్యర్థుల గెలుపునకే నేతలు, కార్యకర్తలు కృషి చేయాలి. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరూ వ్యవహరించవద్దు. ప్రస్తుతం సీట్లు ఇవ్వలేని వారికి భవిష్యత్తులో తప్పక న్యాయం చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.

జగన్ ఉడత బెదిరింపులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరు

మొదటి పేజీ తరువాయి

వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ ఉడత బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడేవారెవరూ ఇక్కడ లేరని, ఇది ప్రజాస్వామ్యం తప్ప జమీందారీ రాజ్యం కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు అచ్చెన్నాయుడు సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు.

"వడ్డీతో సహా చెల్లిస్తాం", "ఇప్పుడు మీ టైం.. తర్వాత మా టైం" వంటి హెచ్చరికలను మానుకోవాలని అచ్చెన్నాయుడు హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో తుది తీర్పు ఇచ్చేది ప్రజలేనని గుర్తుంచుకోవాలన్నారు. గత ఐదేళ్ల దారుణ పాలనపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక, అధికారులను, పోలీసులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి అభ్యర్థి పూర్తి స్వేచ్ఛతో నామినేషన్ వేస్తున్నారని, తమ పాలనకు, గత పాలనకు ఉన్న తేడా ఇదేనని పేర్కొన్నారు. గతంలో జరిగిన హింసాత్మక ఘటనలను ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. సొంత పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిపై వైసీపీ నేతలు దాడి చేసినా, పుంగనూరులో మిథున్‌రెడ్డి హింస సృష్టించినా జగన్‌కు కనపడలేదా అని ప్రశ్నించారు. మాచర్లలో బోండా ఉమ, బుద్దా వెంకన్నలపై జరిగిన దాడులను, ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌ను తొలగించేందుకు తెచ్చిన నల్ల ఆర్డినెన్స్‌ను ప్రజలు మర్చిపోలేదన్నారు. జగన్ తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని, ఎన్ని పాదయాత్రలు చేసినా, పొర్లుదండాలు పెట్టినా ప్రజలు ఇక నమ్మరని విమర్శించారు. "సొంత చెల్లి, మేనకోడలిపైనే కక్ష సాధించే సైకో, దుర్మార్గుడు రాష్ట్ర ప్రజలకు ఏం మేలు చేస్తాడు? తండ్రిలాంటి మేనమామ స్థానంలో ఉండి, సొంత మేనకోడలి వివాహానికే అడ్డంకులు సృష్టిస్తున్నావంటే నీ రాక్షసత్వం అర్థమవుతోంది" అంటూ అచ్చెన్నాయుడు తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.

పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా.. భయపడొద్దు.. తిరగబడండి:

మొదటి పేజీ తరువాయి

"మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని... మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట..

మొదటి పేజీ తరువాయి



బాలివుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు బాంబే హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఆయనకు జారీ చేసిన 'లీవ్ ఇండియా' నోటీసుపై కోర్టు స్టే విధించింది. ఈ క్రమంలో తదుపరి విచారణ తేదీ నవంబర్ 1 వరకు ఇమ్రాన్‌పై ఎలాంటి చర్యలూ తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అక్టోబర్ 28లోగా ఇమ్రాన్ ఖాన్ భారత్ విడిచి వెళ్లాలని ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఓఓ) నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నోటీసును బాంబే హైకోర్టులో సవాలు చేయగా ఆయనకు స్వల్ప ఊరట దక్కింది. కాగా అమెరికా పౌరసత్వం ఉన్న ఇమ్రాన్ ఖాన్ అక్టోబర్ 10న భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనల్లో పాల్గొన్నారని, విదేశి పౌరుడు ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమని బీజేపీ నాయకుడు కిరీట్ సోమయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందించి ఇమ్రాన్‌కు 'లీవ్ ఇండియా' నోటీసు పంపించారు. అక్టోబర్ 28లోపు దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. అయితే ఇమ్రాన్ ఖాన్ ఈ నోటీసును కోర్టులో సవాలు చేశారు. తాను ఎలాంటి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనలేదని తెలిపారు. విచారణ చేపట్టిన కోర్టు నోటీసుపై స్టే విధించింది. తదుపరి విచారణ తేదీ వరకు చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేసింది.

రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ సభకు అనుమతి..

మొదటి పేజీ తరువాయి

దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అయితే ఈ సభకు సంబంధించి పలు నిబంధనలు విధించారు. సభ సాయంత్రం 5 గంటల్లోగా ముగించాలని, రామ్‌లీలా మైదానంలో రాత్రి ఎవరూ బస చేయకూడదని స్పష్టం చేశారు. సీసీటీవీ కెమెరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, స్వచ్ఛంద సేవకుల ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలని నిర్వాహకులకు సూచించారు (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్), ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ సభ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

రాహుల్ గాంధీ సహా పలువురు విపక్ష నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది రామ్‌లీలా మైదానంలో సభ నిర్వహణకు సంబంధించి ఢిల్లీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అయితే మైదానం యాజమాన్య సంస్థ నుంచి అవసరమైన అనుమతి పొందడంతో పాటు, పోలీసుల నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. సభను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నిర్వహించాలి. కార్యక్రమం ముగిసిన వెంటనే సభకు వచ్చినవారు మైదానం నుంచి వెళ్లిపోయేలా ఏర్పాట్లు చేయాలి. సభకు ముందు, సభ సమయంలో లేదా అనంతరం ఎవరూ అక్కడ రాత్రి బస చేయడానికి వీల్లేదు సభలో భద్రతను పర్యవేక్షించేందుకు కీలక ప్రదేశాల వద్ద హైడెఫినిషన్ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు ఆదేశించారు ప్రజల మధ్య విద్వేషాలు, ఉద్రిక్తతలు సృష్టించే ప్రసంగాలు చేయకూడదు. ఎవరైనా రెచ్చగొట్టే లేదా బెదిరింపు వ్యాఖ్యలు చేస్తే, నిర్వాహకులు వెంటనే మైకులు నిలిపివేసి సంబంధిత వ్యక్తిని వేదిక నుంచి తొలగించాల్సి ఉంటుంది. రామ్‌లీలా మైదానం నుంచి మరే ఇతర ప్రాంతానికీ ఊరేగింపుగా వెళ్లడానికి అనుమతి లేదని పోలీసులు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

వెల్లింగ్టన్‌లో అభిషేక్ సునామీ

రికార్డుల మోతతో సిరీస్ భారత్ కైవసం

కివీస్‌పై మూడో టీ20లో టీమిండియా ఘన విజయం

యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 38 బంతుల్లోనే 113 పరుగులు

పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్

ఈ విజయంతో 3-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా

భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించిన భారత జట్టు

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పరుగుల సునామీ సృష్టిస్తూ కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేయగా, టీమిండియా మరపురాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఊది పారేశారు. అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ భారీ స్కోరు కూడా చిన్నబోయింది. ఈ పోరులో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. న్యూజిలాండ్ బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబర్చారు. డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (25 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆతిథ్య నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) కివీస్ బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. తొలి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించారు. ఇది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో రొమేనియా (116/0) రికార్డును భారత్ బద్దలుకొట్టింది. కేవలం 2.2 ఓవర్లలోనే 50 పరుగులు, 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంది. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం తర్వాత వైభవ్ ఔటైనా, అభిషేక్ తన జోరు కొనసాగించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిషేక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సంజూ శాంసన్ (18) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో తిలక్ వర్మ (1), నమన్ ధీర్ (4) లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో టీమిండియా కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 3-0 చేజిక్కించుకోగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

ఇలాంటి బ్యాటింగ్ ఎప్పుడూ చూడలేదన్న అయ్యర్.. వాళ్లను ఆపడం కష్టమన్న శాంట్నర్

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా చారిత్రక విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇరు జట్ల కెప్టెన్లు వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రత్యర్థి సారథి మిచెల్ శాంట్నర్ ఆ ఇద్దరినీ ఆకాశానికెత్తేశారు. ఈ అద్భుత ప్రదర్శనపై మ్యాచ్ అనంతరం శ్రేయస్ అయ్యర్ స్పందిస్తూ.. "నిజంగా అద్భుతం. వారిద్దరూ ఆడిన షాట్లు కళ్లకు చాలా ఇంపుగా అనిపించాయి. నేను, సంజు బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు బంతి సీమ్ అవుతోంది. వాళ్లిద్దరూ ఇలాంటి పిచ్‌పై అంత సులువుగా ఎలా ఆడగలిగారని ఆశ్చర్యపోయాను. ఇది నమ్మశక్యం కాని విషయం" అని అన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి బ్యాటింగ్ చూడటం ఇదే మొదటిసారని, ఐదు ఓవర్లలోనే 100 పరుగులు చేయడం ఎప్పుడూ చూడలేదని అయ్యర్ కొనియాడాడు. వారి ప్రదర్శన అన్నింటికంటే అత్యుత్తమమని ప్రశంసించాడు. మరోవైపు, న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కూడా భారత ఓపెనర్ల బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. "వాళ్లు అలా చెలరేగి ఆడుతుంటే ఆపడం చాలా కష్టం. వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను గతంలో ఐపీఎల్‌లో చూశాం. ఇప్పుడు మా దేశంలో ప్రత్యక్షంగా చూశాం. పవర్‌ప్లేలో ఎలా బ్యాటింగ్ చేయాలో వాళ్లు నిరూపించారు" అని శాంట్నర్ వ్యాఖ్యానించారు. మంగళవారం వెల్లింగ్టన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (113), వైభవ్ సూర్యవంశీ (45) తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. పవర్‌ప్లేలో రికార్డు స్థాయిలో 118 పరుగులు సాధించి భారత భారీ విజయంలో ప్రధాన భూమిక పోషించారు.

సీఎస్‌కేలో భారీ ప్రక్షాళన

కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్, పలువురిపై వేటు!



ఐపీఎల్ 2027 సీజన్ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ఫ్రాంచైజీ తమ కోచింగ్ విభాగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్‌ను కొత్త హెడ్ కోచ్‌గా నియమించిన యాజమాన్యం, పలువురు కీలక సిబ్బందిని విధుల నుంచి తప్పించింది. జట్టు స్ట్రెంత్, కండిషనింగ్ కోచ్ గ్రెగ్ కింగ్‌ను కూడా తొలగిస్తున్నట్లు సోమవారం సీఎస్‌కే యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. జట్టు శారీరక దృఢత్వం (ఫిజికల్ ప్రిపరేషన్) కోసం ఇన్నాళ్లు ఆయన అందించిన సేవలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపింది. అదేవిధంగా, మరికొందరు కీలక సభ్యులు కూడా జట్టు నుంచి వైదొలిగినట్లు ఫ్రాంచైజీ వెల్లడించింది. వారిలో బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ, బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్, అసిస్టెంట్ బ్యాటింగ్ కోచ్ రాజీవ్ కుమార్ ఉన్నారు. వీటితో పాటు, ఐపీఎల్ ప్రారంభ సీజన్ 2008 నుంచి జట్టుతో కొనసాగుతున్న ఫిజియోథెరపిస్ట్ టామీ సిమ్సెక్ సేవలను కూడా నిలిపివేసింది. నూతన నియామకాలలో భాగంగా, జహీర్ ఖాన్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనుండగా, ఇంగ్లండ్ మాజీ ఆఫ్ స్పిన్నర్ గారెత్ బ్యాటీ అసిస్టెంట్ కోచ్‌గా, భారత మాజీ పేసర్ మోహిత్ శర్మ బౌలింగ్ కోచ్‌గా నియమితులయ్యారు. గత 18 ఏళ్ల పాటు సీఎస్‌కే హెడ్ కోచ్‌గా విశేష సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్, ప్రస్తుతం ఇంగ్లండ్ టెస్ట్ జట్టు కోచింగ్ బృందంలో చేరాడు. అలాగే, సీఎస్‌కే మాజీ బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్, ఫీల్డింగ్ కోచ్ జేమ్స్ ఫోస్టర్ కూడా ప్రస్తుతం ఇంగ్లండ్ జట్టుతో కలిసి పనిచేస్తున్నారు.

మా ప్లాన్ చాలా సింపుల్.. వైభవ్ తో ఓపెనింగ్ పై అభిషేక్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూజిలాండ్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగి, కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు సాధించి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన తర్వాత, యువ సంచలనం అభిషేక్ శర్మ తన విధ్వంసక ఇన్నింగ్స్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. తాను, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడటమే తమ ప్రణాళిక అని, ముఖ్యంగా పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకోవాలని ముందే నిర్ణయించుకున్నామని తెలిపాడు. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న అభిషేక్ తన మనసులోని మాటలను వెల్లడించాడు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా వెల్లింగ్‌టన్‌లోని హెన్రీ స్టేడియంలో జరిగిన మూడో టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అభిషేక్ శర్మ (38 బంతుల్లో 113; 9 ఫోర్లు, 11 సిక్సర్లు) సునామీ సెంచరీతో కేవలం 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది. తన ఇన్నింగ్స్ గురించి అభిషేక్ శర్మ మాట్లాడుతూ, "మా ప్లాన్ చాలా సింపుల్. నేను, వైభవ్ స్వేచ్ఛగా, ఆస్వాదిస్తూ ఆడాలనుకున్నాం. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడే పిచ్‌ను క్షుణ్ణంగా గమనించాం. బౌన్స్ కాస్త ఎక్కువగా ఉందని అర్థమైంది. అయితే, మైదానం కొలతలు, బౌలర్ల వేగాన్ని ఉపయోగించుకుని పవర్‌ప్లేలో దూకుడుగా ఆడవచ్చని భావించాం. వైభవ్ తొలి ఓవర్‌లోనే దూకుడుగా ఆడటం జట్టుకు మంచి ఊపునిచ్చింది. అదే జోరును కొనసాగించాలనుకున్నాం" అని వివరించాడు. ఈ ప్రదర్శన వెనుక చాలా కఠోర శ్రమ, సరైన ప్రణాళిక ఉందని అభిషేక్ అన్నాడు. "కోచింగ్ సిబ్బంది, కెప్టెన్ నాపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు. ముఖ్యంగా మా కోచ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాలి. నెట్స్‌లో సైడ్ ఆర్మ్ ద్వారా మేము చాలా ప్రాక్టీస్ చేశాం. ఒక బ్యాటర్‌గా మ్యాచ్‌కు ముందు చేసే సన్నాహకమే అత్యంత కీలకం. పరిస్థితులు, మైదానం కొలతలను దృష్టిలో ఉంచుకుని, బౌలర్లకు అనుగుణంగా షాట్లు ఆడాల్సి ఉంటుంది. నిన్న ప్రాక్టీస్ సెషన్‌లో చేసిన ప్రణాళికలనే ఇవాళ అమలు చేశాను. ఈ ఇన్నింగ్స్ ఆడాలని బలంగా కోరుకున్నాను, అది నెరవేరింది" అని తన సంతోషాన్ని పంచుకున్నాడు. గతంలో 12 బంతుల్లో 50 పరుగులు చేసిన యువరాజ్ సింగ్, 'ఇప్పటికీ 12 బంతుల్లో హాఫ్ సెంచరీ చేయలేకపోయావ్' అంటూ సరదాగా చేసిన సోషల్ మీడియా పోస్ట్‌పై అభిషేక్ స్పందించాడు. "ఆ రోజుల్లో యువీ పాజీ ఎలాంటి క్రికెట్ ఆడాడో నాకు తెలియదు కానీ, 12 బంతుల్లో 50 పరుగులు చేయడం అస్సలు సులభం కాదు. ఏ బ్యాటర్ అయినా అలా ఆడాలనుకుంటే అది చాలా కష్టం. అది ఎప్పుడో ఒకసారి మాత్రమే జరుగుతుంది. అయితే, ఒక బ్యాటర్‌గా మేము ఆ మైలురాళ్ల కోసం ఆడం. జట్టు కోసం మ్యాచ్ గెలవాలనే లక్ష్యంతోనే బరిలోకి దిగుతాం" అని అభిషేక్ శర్మ స్పష్టం చేశాడు.

భారత మిడిలార్డర్‌లో ఆరోగ్యకరమైన పోటీ: నితీశ్ రెడ్డి

భారత జట్టు మిడిలార్డర్ బ్యాటర్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉందని ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తెలిపాడు. ఒకరు పరుగులు సాధిస్తే మరొకరు స్ఫూర్తి పొందుతారని, అవకాశం వచ్చినప్పుడు తామూ రాణించాలనే పట్టుదల పెరుగుతుందని పేర్కొన్నాడు. జట్టు విజయాల్లో ఇలాంటి పోటీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భారత మిడిలార్డర్ అద్భుతంగా రాణిస్తోంది. తొలి మ్యాచ్‌లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో, రెండో మ్యాచ్‌లో క్లిష్ట పరిస్థితుల్లో 181 పరుగుల లక్ష్యాన్ని అందుకోవడంలో కీలక పాత్ర పోషించింది. మూడో టీ20కి ముందు నితీశ్ మాట్లాడుతూ.. "జట్టులో పోటీ తప్పకుండా ఉంటుంది. అయితే అది ఆరోగ్యకరమైన పోటీగా ఉండాలి. నమన్ లేదా తిలక్ పరుగులు సాధిస్తే.. నా వంతు అవకాశం కోసం నేను ఎదురుచూస్తాను. వారు విఫలమైనప్పుడు నేను పరుగులు చేస్తే.. తర్వాత తమకు అవకాశం రావాలని వారు ఆశిస్తారు. టీమ్ గేమ్ ఎదిగేది ఇలాగే. ఆరోగ్యకరమైన పోటీ అంటే ఇదే" అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడటమే భారత జట్టు విజయాలకు ప్రధాన కారణమని నితీశ్ తెలిపాడు. "ప్రస్తుత పరిస్థితులపై దృష్టి పెట్టడం, మ్యాచ్ పరిస్థితులను సరిగ్గా అంచనా వేయడం ముఖ్యం. భారత్‌లో చాలా క్రికెట్ ఆడినా.. న్యూజిలాండ్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని, మన బలాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి" అని వివరించాడు.

జక్కన్న ప్లాన్.. మహేష్‌కు
గ్లోబల్ రీచ్ దక్కేనా?



'ఆర్ఆర్ఆర్' తో ఆస్కార్ వేదికను షేక్ చేసిన రాజమౌళి ఆ క్రేజ్ ను ఏమాత్రం వృధా పోనివ్వడం లేదు. సినిమా సెట్స్ లో, ఎడిటింగ్ రూమ్ లో బిజీగా ఉండాల్సిన ఈ స్టార్ డైరెక్టర్ తరచుగా విదేశీ ఈవెంట్లలో కనిపిస్తూ ఆడియన్స్ తో టచ్ లో ఉంటున్నారు. అక్కడ తనకు దక్కిన గ్లోబల్ గుర్తింపును, ఇప్పుడు మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' సినిమా ఓపెనింగ్స్ కోసం వాడుకునేలా జక్కన్న భారీ గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో, ఇండియాలో మహేష్ బాబు క్రేజ్ ఏంటో అందరికీ తెలిసిందే. కానీ నార్త్ అమెరికా, యూరప్ లోని నాన్ఇండియన్ ఆడియన్స్ కు మాత్రం మన సూపర్ స్టార్ కొత్త. వాళ్లను థియేటర్లకు రప్పించాలంటే కేవలం హీరో ఇమేజ్ సరిపోదు. అందుకే 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలతో వాళ్ళకు బాగా రిజిస్టర్ అయిన తన బ్రాండ్ ఇమేజ్ ను ముందు పెట్టి, ఈ గ్లోబల్ ప్రాజెక్ట్ కు ఇంటర్నేషనల్ మార్కెట్ ను సెట్ చేసే పనిలో రాజమౌళి బిజీగా ఉన్నారు. ఇక కంటెంట్ పరంగా చూసుకుంటే 'వారణాసి' ఒక రెగ్యులర్ కమర్షియల్ బొమ్మ కాదు. పూర్తిస్థాయి ఐమాక్స్ టెక్నాలజీతో, కళ్లు చెదిరే కెమెరాలతో దీన్ని చిత్రీకరిస్తున్నారు. టైమ్ ట్రావెల్, మైథాలజీ అంశాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలను కలిపే కథ కావడంతో, దీనికి తగ్గట్టుగానే విదేశీ ఆడియన్స్ కు కనెక్ట్ అయ్యేలా స్పెషల్ ప్రమోషనల్ కంటెంట్ ను డిజైన్ చేయాల్సిన అవసరం జక్కన్నపై ఉంది. ఈ గ్లోబల్ మిషన్ లో కాస్టింగ్ కూడా గట్టిగానే ప్లాన్ చేశారు. హాలీవుడ్ మీడియాకు బాగా పరిచయం ఉన్న గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాను 'మందాకిని' పాత్ర కోసం తీసుకోవడం ఈ ప్రాజెక్ట్ కు బిగ్గెస్ట్ అడ్వాంటేజ్. విదేశీ ప్రమోషన్లలో రాజమౌళికి ఆమె తోడైతే రీచ్ నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. అటు సౌత్ మార్కెట్ ను లాక్ చేయడానికి మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ఎలాగూ ఉన్నారు. ప్రస్తుతం 'వారణాసి' షూటింగ్ చివరి దశలో ఉంది. ఇప్పటికే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ కంప్లీట్ కాగా, ఓ వైపు ఎడిటింగ్, మరోవైపు విజువల్ ఎఫెక్ట్స్ పనులు సమాంతరంగా నడుస్తున్నాయి. 2027 ఏప్రిల్ 7న ఈ విజువల్ వండర్ ను థియేటర్లలోకి తీసుకు రాబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే అఫీషియల్ గా లాక్ చేసేశారు. ఆ టార్గెట్ కు తగ్గట్టుగానే ఇటు షూట్, అటు ఇంటర్నేషనల్ పబ్లిసిటీ బ్యాలెన్స్ చేస్తున్నారు. ఇప్పుడు జక్కన్న విదేశీ టూర్లు అన్నీ కేవలం 'వారణాసి' ముందస్తు అడుగులు మాత్రమే. సినిమా రిలీజ్ దగ్గర పడేకొద్దీ ఇంటర్నేషనల్ ప్రీమియర్లు, ఐమాక్స్ స్పెషల్ ప్రమోషన్లు గట్టిగానే ప్లాన్ చేస్తారు. అయితే ఈ గ్లోబల్ ప్రాజెక్ట్ ను విదేశాల్లో డిస్ట్రిబ్యూట్ చేసే పార్ట్నర్స్ ఎవరన్నది ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఆ డీల్స్ కూడా సెట్ అయితే జక్కన్న బాక్సాఫీస్ వేట ఏ రేంజ్ లో ఉంటుందో చూడాలి.

ఫెస్టివ్ లుక్‌లో మాళవిక మోహనన్

సౌత్ ఇండస్ట్రీలో తనదైన అందం, నటనతో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతోంది మలయాళ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్. ఇటీవల పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన 'ది రాజాసాబ్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ భామ, సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామరస్ ఫోటోలతో సందడి చేస్తూ ఉంటుంది. తాజాగా దీపావళి పండుగ సందడిని పురస్కరించుకుని ఈ బ్యూటీ షేర్ చేసిన ట్రెడిషనల్ ఫోటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. దివాలి పండుగ వైబ్‌ను చాటుతూ 'థట్ టైం అఫ్ ది ఇయర్ ' అనే క్యాప్షన్‌తో మాళవిక మోహనన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని అద్భుతమైన ఫోటోలను పోస్ట్ చేసింది. వైబ్రెంట్ క్రిమ్సన్ రెడ్ కలర్ బనారసీ హ్యాండ్ ఎంబ్రాయిడరీ లెహంగా లంగా ఓణీలో ఆమె అప్సరసలా మెరిసిపోయింది. ఈ అవుట్‌ఫిట్‌లో ఆమె చూపిన సంప్రదాయ అందం, రాయల్ ఎలిగెన్స్ చూసి ఫ్యాన్స్ మంత్రముగ్ధులవుతున్నారు. ఈ ఫెస్టివ్ లుక్‌కు మరింత అందాన్ని తేవడానికి మాళవిక మోహనన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. తలలో నీట్‌గా తురుముకున్న మల్లెపూల చెండు, చెవులకు హెవీ స్టేట్‌మెంట్ బంగారు జుంకాలు, చేతులకు మ్యాచింగ్ గాజులు, నుదుటిన చిన్న నల్లటి బొట్టుతో పక్కా భారతీయ సంప్రదాయ యువతిలా మురిపించింది. ఈ క్లాసిక్ ఎత్నిక్ లుక్ ఆమెను పండుగ వేళ మరింత అందంగా ఆవిష్కరించింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి మలయాళ చిత్రం 'పట్టం పోల్' ద్వారా వెండితెరకు పరిచయమైన మాళవిక, 'చెన్నై టైమ్స్ మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ 2020'లో ఐదవ స్థానంలో నిలిచింది. తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తూ దూసుకెళ్తోంది. ఇక ఇటీవల తమిళంలో కార్తి సరసన 'సర్దార్ 2' లో పవర్‌ఫుల్ యాక్షన్ రోల్ చేసిన ఈ భామ, ప్రస్తుతం తిరుమల కుమారరాజ దర్శకత్వంలో విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నావెల్' అనే క్రైమ్ డ్రామాలో నటిస్తోంది.

వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' చిత్రానికి సెన్సార్ పనులు పూర్తి

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 - ఏకే 47'. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ U/A సర్టిఫికెట్ జారీ చేసింది. అక్టోబర్ 30న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ, "క్రైమ్, కామెడీ, యాక్షన్, ఫ్యామిలీ ఫన్ అన్నీ ఒకేచోట.. ఇది మిస్ చేయలేని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్" అని నిర్మాణ సంస్థ పేర్కొంది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మొదట అక్టోబర్ 2న, ఆ తర్వాత అక్టోబర్ 9న విడుదల చేయాలని భావించినప్పటికీ, తాజాగా అక్టోబర్ 30 తేదీని ఖరారు చేశారు. వెంకటేష్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వెంకటేష్ నటించిన బ్లాక్‌బస్టర్ 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రానికి త్రివిక్రమ్ రచయితగా పనిచేయడం విశేషం. ఆ సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. దీనికి తోడు, వెంకటేశ్ చివరి చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' కూడా భారీ విజయం సాధించడంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ చిత్రంలో వెంకటేష్‌కు జోడీగా 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి నటిస్తోంది. ఇటీవల ఆమె పాత్ర 'స్వర్ణ'ను పరిచయం చేస్తూ విడుదల చేసిన వీడియోకు మంచి స్పందన వచ్చింది. అందులో వెంకటేశ్ పాత్ర చిట్టిబాబు, "ఈ ఆడాళ్లకి ఆటిట్యూడ్ తప్ప గ్రాటిట్యూడ్ ఉండదు" అంటూ చెప్పే సంభాషణలు ఆకట్టుకున్నాయి. అలాగే, ఈ సినిమాలో యంగ్ హీరో నారా రోహిత్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పోస్టర్‌ను బట్టి పోలీస్ అధికారి పాత్రలో కనిపించవచ్చని ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద, ఎన్నో అంచనాల మధ్య ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

100 సార్లేంటి.. వెయ్యిసార్లైనా పెళ్లి చేసుకోమని అడుగుతా!

ట్రోలర్లకు రష్మిక గట్టి సమాధానం

విజయ్ దేవరకొండను పెళ్లి చేసుకోవాలని వందసార్లు అడిగానన్న వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలకు నటి రష్మిక మందన్న గట్టిగా బదులిచ్చింది. తన ప్రేమ, పెళ్లి గురించి ఇతరులు తీర్పులు చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. తన జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు తనకు ఉందని, విజయ్‌ను మళ్లీ మళ్లీ ఎంచుకుంటూనే ఉంటానని చెప్పింది. 'వెయ్యిసార్లైనా ఇదే నిర్ణయం తీసుకుంటా.. వందసార్లు అనేది పెద్ద విషయమే కాదు' అంటూ ట్రోలర్లకు సమాధానమిచ్చింది. ఇటీవల 'కాఫీ విత్ కరణ్-9' కార్యక్రమానికి సంబంధించిన ప్రోమోలో రష్మిక, విజయ్ తమ పెళ్లి గురించి మాట్లాడారు. తాను పెళ్లి చేసుకుందామని విజయ్‌ను ఏడాది పాటు అడిగానని రష్మిక చెప్పింది. దాదాపు వందసార్లు అడిగిన తర్వాతే విజయ్ అంగీకరించాడన్న విషయం చర్చకు దారితీసింది. విజయ్ ఆమెను అవమానించాడంటూ కొందరు సోషల్ మీడియాలో విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో రష్మిక తన సోషల్ మీడియా పోస్ట్‌తో స్పందించింది. తమ మధ్య ప్రేమ అనేది పెళ్లి ప్రపోజల్, ఉంగరం తొడగడం వంటి విషయాలకే పరిమితం కాదని రష్మిక తెలిపింది. జీవితాన్ని కలిసి నిర్మించుకోవడమే అసలైన విషయమని పేర్కొంది. తాను భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకునే వ్యక్తినని, విజయ్ మాత్రం అన్ని కోణాల్లో ఆలోచిస్తాడని చెప్పింది.

Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District